# పొగబోతు భార్య



తన భార్య సిగరెట్లు తాగుతుందని రాజా కనిపెట్టి ఉండకపోతే, పైన అచ్చు తప్పు పడిందనే అతనూ అనుకునేవాడు. పొగరుబోతు భార్యలున్నంత విరివిగా పొగబోతు భార్యలుండరుగా! తన సిగరెట్లు తరిగిపోతున్నాయనే విషయం పెళ్లయిన నెల్లాళ్లదాకా కనుక్కోలేకపోయాడతను. బొత్తిగా అయోమయం మనిషి కాదతను. సిగరెట్లకు లెక్కా పత్రం ఉంచుకోకపోవడం, ఆడవాళ్లు సిగరెట్లు తాగగలరనే ఊహ పోకపోవడం - వీటివల్ల అలా జరిగింది.

ఓసారి అతని మిత్రుడు ఫారిన్ నుంచి సిగరెట్టు పాకెట్టు ఒకటి తెచ్చి ఇచ్చాడు. దాన్ని అపురూపంగా చూసుకుని ఒక్కొక్కటీ కాల్చి తన్మయత్వంతో రాజా ఊగిపోతుటే ఇక సావిత్రి ఉండబట్టలేకపోయింది. ఆరో సిగరెట్టు కూడా అతను ఊదేస్తుంటే మర్నాటికి పాకెట్టు మిగలదన్న భయంతో చటుక్కున తనూ ఓ సిగరెట్ వెలిగించింది. వెలిగించి తనకిస్తోందేమో, తమాషాగా ఉంటుంది అని ఎదురుచూస్తున్న రాజా, సావిత్రే పొగ పీల్చడంతో ఖంగుతిన్నాడు.

కోపం కంటే ఆశ్చర్యం పాలు ఎక్కువైపోయి కొంతసేపటిదాకా ఉక్కిరిబిక్కిరైపోయాడు.

"ఇదెక్కడి ఘోరం!" అని నిలదీశాడు.

కాస్త కన్నీళ్లు రంగరించి సావిత్రి ఇచ్చిన సంజాయిషీ ఇలా సాగింది - "కాలేజీలో ఉండగానే సరదాగా కాల్చాలనిపించిందండీ! అసలు మగాళ్లంతా ఇదంటే ఎందుకంత పడి ఛస్తారో చూద్దామనిపించింది. ఎలా ఉంటుందోనని స్నేహితురాళ్లం పదిమందిమి కలిసి కాల్చాం. తమాషాగా తోచి కాల్చలేని మిగతా వాళ్లను ఉడికించడానికి చాలా సార్లు తాగాం. మిగతా వాళ్లంతా క్రమేణా మానేశారు కానీ, నాకూ, సుజాతకీ మాత్రం అలవాటై కూర్చుందండీ! చెప్తే, మీరేమనుకుంటారోనని, మీరు ఆఫీసుకెళ్లగా చూసి అప్పుడప్పుడు తాగుతున్నా!"

రాజాకు జాలేసింది, సాటి పొగ తాగుబోతు కనుక, తనకేం అభ్యంతరం లేదుకానీ, సాధ్యమైనంత వరకు అలవాటు మానుకోమని సుతారంగా హెచ్చరించి, జాలి మాత్రం బాహాటంగానే ప్రకటించాడు. అదే అతని పొరపాటు.

తరువాత రాత్రులు భోజనం చేసి, తాంబూలం వేసుకుని సిగరెట్టు కాల్చుకుందామని అతను కూర్చుంటే, "ఆగండి, నేనూ వస్తున్నాను, ఇద్దరం కలిసి కాల్చుకుందాం" అనేది సావిత్రి. ఆ సంగతి చుట్టుపక్క వాళ్లెవరైనా పసిగడతారేమోనని భయపడి రాత్రి డాబా మీద పచార్లు మానేసి, ఇంట్లోనే కూర్చుని కాల్చుకునేవాళ్లు.

ఈ వ్యవహారం రాస్తున్నంత కాజువల్‌గా సాగిందనీ, సావిత్రి పొగతాగడాన్ని రాజా ప్రోత్సహించాడనీ విజ్ఞులు కూడా పొరబడే ప్రమాదం ఉంది కాబట్టి, వేర్వేరు సందర్భాల్లో వారి సంభాషణలు జరిగిన విధానాన్ని ఉటంకించవలసిన అవసరం పడుతోంది.

"చూడు సావిత్రీ! ఇది ఎవరికైనా తెలిస్తే ఏం బాగుంటుంది? ఈ అలవాటు మానేయ్!"

"మీకు అభ్యంతరం లేనప్పుడు ఇంకెవరైనా ఏమైనా అనుకుంటారని నాకు భయం లేదండీ!"

"నాకు అభ్యంతరం లేదన్నమాట సరేననుకో! కానీ..."

"సావిత్రీ! ఈ సిగరెట్లు తాగడం ఎప్పుడు మానేస్తావ్?"

"అసలెందుకు మానాలి? నేను మిమ్మల్నెప్పుడైనా ఆ మాట అడిగేనా?"

"బావుంది. ఆడవాళ్లకీ, మగవాళ్లకీ తేడా లేదా?"

"సమానమే అంటూ మీరు లెక్చర్స్ ఇస్తారుగా!"

"మిగతా వాటిలో సమానమే. కానీ ఈ విషయంలో..."

"ఏం? ఇందులో మాత్రం ఏం కష్టం వచ్చింది?"

"నీతో మాట్లాడటం కష్టంగా ఉంది సుమా!"

"అసలు సిగరెట్లు మానేయమని మీరు నన్ను పోరుపెడుతూంటారు కానీ, నేను సిగరెట్లు తాగడం వల్ల మీకెంత లాభమో మీరు గుర్తించడం లేదు."

"లాభమా? ఏమిటది? డబ్బు ఖర్చు తప్ప నాకేమీ కనపడటం లేదు."

"తక్కిన ఆడవాళ్లందరూ వాళ్ల భర్తల్ని స్మోకింగ్ మానేయమని వేధిస్తూంటారు. నేను చూడండి. ఎప్పుడూ అలా అనను."

"నువ్విలాగే కాలుస్తూంటే, నువ్వు వేధించినా, ధించకపోయినా నేను మానేయడం మాత్రం

ఖాయం!"

"సావిత్రీ! నీ వరస నాకేం నచ్చటం లేదు. నీ స్మోకింగ్ నా జీవితంలో పెద్ద విషమ సమస్య అయిపోయేలా ఉంది. ఇంతకీ నువ్వు మానతావా, లేదా?"

"ఇందులో మీకంత సమస్య ఏముందండీ? పెళ్లయి ఆర్నెల్లు కావస్తోంది, ఇప్పటిదాకా ఈ సంగతి మీ వాళ్లకెవరికీ తెలియలేదు కదా! నేనెంత జాగ్రత్తగా ఉంటున్నానో గమనించండి. పెళ్లయ్యాక నా సరదాలన్నీ చంపుకున్నాను. కాలేజీలో హాయిగా జీన్స్ వేసుకునేదాన్ని. పెళ్లయ్యాక చచ్చినట్టు అవన్నీ మానేసి చీర కట్టుకుంటున్నాను. కనీసం ఈ ఒక్క సరదా అయినా తీర్చుకోనివ్వరా?'

"నిన్ను జీన్స్ వేసుకోవద్దని ఎవడన్నాడు? కావాలంటే హాట్‌పాంట్స్ వేసుకుతిరుగు. కానీ ఈ పాడు అలవాటు మానేయ్! ఆరోగ్యానికి కూడా మంచిదికాదు."

"మీ ఆరోగ్యానికి మాత్రం మంచిదా? మీరెందుకు మానటం లేదు? మీరంతా మేల్ చావనిస్టులు. తమతోపాటు సమానంగా ఆడది మసలితే చూసి ఓర్వలేరు"

"నీతో వాదించడం అనవసరం"

రాజా తల్లి వచ్చి వాళ్లతో ఉండడం ప్రారంభించడంతో ఈ రకం సంభాషణల్లో అంతరాయం కలిగింది. ఓ రోజు ఆవిడ వంటిల్లు సర్దుతుంటే ఊరగాయ జాడీల మధ్య సిగరెట్టు పీక కనబడింది. ఆవిడ ఆ రోజు విరుచుకుపడింది.

"హవ్వ! ఏం పనుల్రా ఇవి? సిగరెట్లు చాటుమాటుగా తాగుతాడని తెలిసినా మా ఎదురుగా తాగడని సంతోషించేవాళ్లం. పెద్దవాళ్లంటే భయం భక్తీ అని మురిసిపోయేవాళ్లం. పెళ్లయ్యాక బుద్ధి బుగ్గిలో కలిసినట్టుంది. శుద్ధీ, శుభ్రం ఏమీ అక్కర్లేదా? సిగరెట్టు పీక పట్టుకొచ్చి ఊరగాయ జాడీల మధ్య పెడతారుట్రా? ఛీ! ఛీ! ఎన్నిసార్లు స్నానం చేసినా ఒకటే ఈ కొంపలో! ఏవమ్మా సావిత్రీ! నువ్వయినా చెప్పద్దూ!"

రాజా సావిత్రి చెవిని దాబా మీదకు లాక్కెళ్లాడు. దాంతోపాటు సావిత్రీ వచ్చింది. నిజం చెప్పమని నిగ్గదీస్తే చెప్పింది - "మొన్నోరోజు, అంటే మీ అమ్మగారు రావడానికి ముందన్నమాట - మీరు ఆఫీసుకెళ్లినప్పుడు సిగరెట్టు కాలుస్తూ టీ.వీ. చూస్తూంటే మీ ఫ్రెండ్ ఆచారి గారు వచ్చారు. ఇది చూస్తే ఊరంతా యాగీ చేస్తాడనీ, మీ పరువు కాయాలనే ఆదుర్దాలో సిగరెట్టు ఆర్పేసి కంగారుగా ఊరగాయగూట్లో పడేశాను. ఆయనెళ్లాక ఎంత వెతికినా దొరకలేదు. కర్మ కాలి అది అత్తగారి కంటబడింది!"

రాజా ఏం చెయ్యగలడు? నిశ్శబ్దంగా నెత్తినోరూ బాదుకున్నాడు. ఆ రాత్రి సావిత్రి సినిమా స్టయిల్లో 'నా కోసం నీలాపనిందలు భరించిన మీ ఋణం ఎలా తీర్చుకోగలను?' మార్కు డైలాగులు కొట్టి కాళ్ల మీద పడబోతుంటే, అనేక సినిమాలు చూసిన అనుభవంతో రాజా కూడా ఆమెను సగంలోనే ఆపి, కౌగలించుకున్నాడు. ('ఛ! ఏమిటీ కన్నీళ్లు సావీ! నువ్వు కంట తడి పెడితే నా గుండె కలుక్కుమంటుంది' అనే డైలాగు చెపితే సీను ఇంకా రసవత్తరంగా ఉండేదని సావిత్రి తరువాత సూచించింది.)

వచ్చి పదిహేను రోజులైనా రాజా తల్లి తిరిగి వెళ్లే ప్రయత్నాలు చేయకపోవడంతో సావిత్రి ఆరాటం హెచ్చింది. సిగరెట్ కాల్చక నోరు పీక్కుపోతోందని, ఇంకో రెండ్రోజులిలాగే గడిస్తే నోరు పడిపోయి పక్షవాతం వచ్చినా ఆశ్చర్య పడిపోవద్దనీ భర్తను హెచ్చరించింది. రాజాలాగా తనూ ఉద్యోగం చేస్తూంటే హాయిగా ఆఫీసులో కాల్చుకోవచ్చు కదాని వాపోయింది

(ఆఫీసులో మాత్రం ఎలా కాల్చగలవని రాజా పాయింటు లాగబోతే కసురుకుంది.)

అత్తగారికి సినిమాలకీ, చుట్టా పక్కాల ఇళ్లకీ వెళ్లే అలవాట్లు లేనందుకు నొచ్చుకుంది. సాయంత్రాలు పార్కుల్లో హాయిగా కూర్చుని సిగరెట్లు కాల్చుకునే హక్కు భారతీయ స్త్రీలకు లేనందుకు బాధపడింది. విశాఖపట్నం అప్పలమ్మలను, విదేశీ వనితలను, సొసైటీ లేడీస్‌ను తలచుకుని అసూయపడింది. రాజా మధ్యతరగతి నేపథ్యాన్ని దుయ్యబట్టింది. అర్ధరాత్రి వీధుల్లో తిరగడం గురించి ఉపన్యసించే వాళ్లు, స్త్రీలకు కాసింత పొగతాగే హక్కు సమకూర్చే విషయంపై ఆలోచించనందుకు విరుచుకుపడింది. ఇంకా చాలా చేసేదే కానీ సిగరెట్ తాగకపోవడం వల్ల మూడ్ రాక ఇంకేం చెయ్యలేకపోయింది.

వీటన్నిటి వల్లా రాజాలో రాజీ ధోరణి కనబడింది. సావిత్రికి తన సానుభూతి ప్రకటించి, తనకు సహాయం చేసే మార్గాల గురించి అన్వేషించేవాడు. చివరికి రాత్రి సెకండ్ షో సినిమా కెళ్లాలని తీర్మానించడం జరిగింది. రిక్షాలో వెళ్లి వచ్చేటప్పుడు సిగరెట్టు తాగితే రిక్షావాడు తెల్లబోయి, మతి తప్పి రిక్షా గోడకేసి గుద్దేసే ప్రమాదం ఉంది కాబట్టి, సినిమా హాలులో చీకట్లో కూర్చుని కాల్చడమే సేఫని, అందుకుగాను, జనసమ్మర్దం తక్కువగా ఉండే అతి బోర్ పిక్చర్‌కి వెళ్లాలనీ నిర్ణయించడం జరిగింది.

కానీ అలాంటి సినిమా హాల్లో కూడా పోలీసు దాడులుంటాయని రాజా ఊహించలేదు. తెరమీద బోరు సినిమానీ, పక్కసీటులో పది మందిలో (దొంగచాటుగానైనా) సిగరెట్టు ఊదేస్తున్న భార్యామణినీ చూడలేక అతను కళ్లు మూసుకుని కూర్చున్నాడు. భుజం మీద పడ్డ చెయ్యి పోలీసువాడిదని అందుకే అతనికి తెలియదు.

"హాల్లో స్మోక్ చేయకూడదని తెలియదా! పద స్టేషన్‌కి!" అన్నప్పుడు కళ్లు తెరిచి వెర్రి మొహం వేశాడు.

సావిత్రి సంగతి గ్రహించింది. "అబ్బే! సిగరెట్టు కాల్చింది నేనండీ! మా వారు కాదు" అంది నిజాయితీగా. పోలీసువాడు తెరమీదకు చూశాడు. భర్త చేసిన హత్యానేరాన్ని తనపై వేసుకున్న ఓ త్యాగమయి భోరుమని ఏడుస్తూ కనబడింది. సావిత్రికేసి జాలిగా చూశాడు. "మరీ అంత త్యాగం నిజ జీవితంలో పనికిరాదమ్మా!" అని మందలించి, "రావయ్యా! లేవవేం?" అన్నాడు కరుకుగా.

రాజా "నేను కాదని ఆవిడ చెప్తోంది కదండీ!" అన్నాడు.

"అంటే ఆవిణ్ని స్టేషన్‌కి తీసుకెళ్లాలనా నీ ఉద్దేశ్యం? ఆడవాళ్లు సిగరెట్లు కాలుస్తారని చెబితే మా ఎస్సై నాకు పిచ్చెక్కిందనుకుంటాడు. ఆవిడ నీ కోసం ఎంత త్యాగం చేస్తోందో చూడు! ఆవిడ మీద అభాండాలు వేయడానికి సిగ్గు లేదయ్యా! పద, పద!" అన్నాడు మొరటుగా.

పోలీస్‌స్టేషన్‌కి నడుస్తున్న రాజా మనసు పరిపరివిధాల పోయింది. 'నిజం చెప్పినా నమ్మరెందుకు? ఆడవాళ్లు పొగతాగరనే నమ్మకం చేత. అంటే ఆడవాళ్లు స్మోక్ చేయలేరు, చేయకూడదు అన్న భావం అంతర్లీనంగా ఉండడం చేతనే కదా ఇలాంటి ఆలోచనలు! ఆడవాళ్లకు పొగతాగే హక్కు లేదా? ఈ విషయం మీద చర్చలు జరిపి, ఆందోళన చేయమని ఓల్గా గారిని అడగాలి. పోలీస్ స్టేషన్నుండి ఫోన్ చేయనిస్తారా? టెలిఫోన్ డైరెక్టరీలో ఆవిడ పేరు 'వి'లో చూడాలా? 'ఒ'లో చూడాలా? అది ఆవిడ అసలు పేరేనా...?'

(ఆంధ్రప్రభ వీక్లీ ఏప్రిల్ 97)

